సాక్షి
విజయనగరం
శనివారం । 15 । ఏప్రిల్ । 2023



గిరిసీమలో జ్వరం


గిరిజన ప్రాంతమైన మన్యంలో వైరల్ జ్వరాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి సమస్యలతో ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. - 8లో



వంగరలో సినీనటుడు శ్రీకాంత్

సినీ నటుడు శ్రీకాంత్‌తోపాటు పలువురు సినీ ఆర్టిస్టులు శుక్రవారం మండల కేంద్రం వంగరలో సందడి చేశారు. - 8లో

సమయానికి పట్టెడు అన్నం



విజయనగరం జిల్లా కేంద్రంలోని ఫుడ్ బ్యాంకులు పేదల ఆకలి తీర్చుతున్నాయి. సమయానికి పట్టెడు అన్నం పెడుతున్నాయి. కోట కూడలి వద్ద ఉన్న ఫుడ్‌బ్యాంకులో వడ్డించిన భోజనంతో శుక్రవారం మధ్యాహ్నం ఆకలి తీర్చుకుంటున్న రిక్షా కార్మికుడిని చిత్రంలో చూడొచ్చు.
- సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



రాజీ శరణం గచ్ఛామి

వారందరూ తెరవెనుక రాజీకుదిర్చే రక్షక భటులు.. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నవారు.. ఏ కేసు వల్ల ఎంత నష్టం చేకూరుతుందో కక్షిదారులకు వివరిస్తారు.. క్షణికావేశంలో భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవుపలుకుతారు.. రాజీకుదుర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తారు. రాజీకి సుముఖత చూపేవారిని తమ పై అధికారుల వద్ద సమావేశపరుస్తారు. వారి సాయంతో కేసుల పరిష్కారానికి కృషిచేస్తారు. జిల్లా కోర్టులలో నిర్వహించే లోక్‌అదాలత్‌లలో వేలాది కేసుల పరిష్కారం వెనుక పోలీస్ అధికారులు, న్యాయవాదులతో పాటు ప్రతీపోలీస్ స్టేషన్ నుంచి కోర్టు వ్యవహారాలు చూసేకానిస్టేబుళ్ల రాజీమంత్రం గట్టిగా పనిచేస్తోంది. కక్షిదారులకు స్వాంతన చేకూర్చుతోంది. ప్రభుత్వ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం సత్ఫలితాలిస్తోంది. ప్రతీ పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు వ్యవహారాలు చూస్తున్న కానిస్టేబుళ్ల రాజీప్రయత్నాల ఫలితాలకు 'సాక్షి' అక్షర రూపం.



విజయనగరం జిల్లా న్యాయ సేవా సదన్



విజయనగరం డెస్క్:

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 53 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతీ పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు పనులు చూసేందుకు ఒక కానిస్టేబుల్/హెడ్‌కానిస్టేబుల్ ఉంటారు. వీరిలో అధికమంది ఉన్నత విద్యావంతులు, చట్టాలపై సంపూర్ణ అవగాహన ఉన్నవారే. పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు కోర్టు పనులు చక్కబెడుతున్నారు. కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి కాలాన్ని వృథాచేసుకోవద్దని హితవు పలుకుతున్నారు. ఇరువర్గాల వారికి తప్పును ఎత్తిచూపుతున్నారు. అధర్మం వల్ల కలిగే నష్టాలను సున్నితంగా తెలియజేస్తున్నారు. తప్పు ఎక్కడ జరిగిందో ప్రాథమికంగా గుర్తించి పోలీస్ అధికారులకు తెలియజేస్తున్నారు. కౌన్సెలింగ్ ఇప్పించి ఇరువర్గాల మధ్య సయోధ్యకుదర్చడంలో కీలకభూమిక పోషిస్తున్నారు. లోక్‌అదాలత్‌లలో సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ తదితర వేలాది కేసుల పరిష్కారానికి తెరవెనుక సూత్రదారులుగా గట్టి రాజీప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే.. ఇటీవల కాలంలో రాజీ కేసుల సంఖ్య అమాంతం పెరిగిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఏడాది కాలంలో లోక్‌అదాలత్‌లో రాజీ అయిన కేసులు ఇలా...	
లోక్‌అదాలత్ నిర్వహించిన తేదీ	రాజీ చేసిన కేసుల సంఖ్య
12-03-2022	3,689
26-06-2022	6,514
13-08-2022	6,605
12-11-2022	11,203
11-02-2023	11,661

సహకరిస్తున్న సచివాలయ మహిళా పోలీస్‌లు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తేవడంతో కోర్టు పనులు మరింత సులభతరమయ్యాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు. వివాదాలు పడేవారి పూర్తి సమాచారం సేకరణలో సచివాలయ మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో కీలక పాత్రపోషిస్తున్నారు. వివిధ కేసుల్లో ఇరువర్గాల వారిని సమావేశ పరిచేందుకు, స్టేషన్ నుంచి సమాచారం సకాలంలో ఇచ్చేందుకు సాయపడుతున్నారు. రాజీయత్నాల్లో కూడా వీరు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. నేరగాళ్ల ఉనికిని తెలియజేస్తూ.. నేర నియంత్రణకు సహకరిస్తున్నారు.

రాజీవల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం



కేసులు, తగాదాల విషయంలో ఇరువర్గాలు మేలు కోసమే జాతీయ లోక్‌అదాలత్ ఏర్పడింది. అందులో భాగంగానే రాజీకాదగ్గ ప్రతీ కేసును రాజీచేసేందుకు ఎస్‌ఐ సమక్షంలో ఇరువర్గాల్లో అవగాహన కల్పిస్తాం. రాజీవల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం. ఫిర్యాదుదారుడు రాజీ అయ్యేందుకు అంగీకారానికి వస్తే ఆ కేసు వివరాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తాం. కోర్టు నుంచి ఫిర్యాదుదారులు, ముద్దాయిలకు నోటీసులు వెళ్తాయి. వారిని మరోసారి స్టేషన్‌కు పిలిపించి పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇస్తారు. ఫిర్యాదుదారుడి అంగీకారం మేరకు లోక్‌అదాలత్‌లో రాజీకుదురుతుంది. లేదంటే కేసు కొనసాగుతుంది. ఎన్నో ఏళ్లుగా తగాదాలు పడుతూ వ్యయప్రయాసలకు గురైనవారి కేసులను రాజీ చేసినప్పుడు వారిలో కలిగే సంతోషం మాకు తృప్తినిస్తుంది.

– శాంతారావు,
కానిస్టేబుల్, చీపురుపల్లి పోలీస్‌స్టేషన్

సహనంతో ముందుకు సాగుతూ...



నా పేరు ముక్కన రామారావు. గతంలో పార్వతీపురంటౌన్ పోలీస్‌స్టేషన్, ప్రస్తుతం గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. ఎస్‌ఐ సూచనల మేరకు వివిధ కేసుల్లో ముద్దాయిలకు నోటీసులిస్తాం. వారిని కోర్టుల్లో హాజరుపర్చుతాం. ఇరువర్గాలవారితోనూ స్నేహంగా మెలగుతాం. దీనివల్ల వారి కష్టసుఖాలు, సమస్యలు తెలుస్తాయి. తప్పు ఎవరు చేశారో ప్రాథమికంగా నిర్ధారణ అవుతుంది. కేసుల వల్ల వారు పడే ఇబ్బందులు గుర్తిస్తాం. కొన్నిసార్లు ఉద్యోగాలకు వెళ్లే యువకులను కూడా కేసుల్లో ముద్దాయిలుగా చేర్చుతారు. ఆ సమయంలో వారి తల్లిదండ్రులు పడే క్షోభను దగ్గరుండి చూస్తాం. తప్పును ఇరువర్గాలకు తెలియజేస్తాం. రాజీవల్ల కలిగే మేలును వివరిస్తాం. కొందరు పశ్చాత్తాపపడతారు. ఫిర్యాదుదారుకు క్షమాపణ చెబుతారు. దీంతో కేసును విత్‌డ్రాచేసుకునేందుకు ముందుకు వస్తారు. వారిని ఎస్‌ఐ ముందు సమావేశపరుస్తాం. ఆయన కౌన్సెలింగ్ ఇచ్చాక లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తి సమక్షంలో రాజీ కుదురుతుంది. ఆ సమయంలో వారు మా పోలీస్‌లపై చూపే ప్రేమ వెలకట్టలేనిది. కోర్టు పనులు చూసేవారమంతా చట్టాలపై అవగాహనతో పాటు సహనంతో ముందుకు సాగుతాం. గరుగుబిల్లి స్టేషన్ నుంచి ఇటీవల కాలంలో సుమారు 400 కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అయ్యాయి. ఉద్యోగంలో ఈ సంతృప్తి చాలు.

నష్టాలను తెలియజేస్తాం



కేసులు, గొడవలు పడడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తాం. నోటీసులు ఇచ్చిన నుంచి వారిని కోర్టులో హాజరుపరిచేవరకు వారి వెంటే ఉంటాం. తప్పు ఎక్కడ జరిగిందో ప్రాథమికంగా గుర్తిస్తాం. ఆ విషయం ఎస్‌ఐ సమక్షంలో ఇరువర్గాలకు సున్నితంగా చెబుతాం. రాజీమార్గం దిశగా ప్రోత్సహిస్తాం. భూ తగాదాలు, ఆస్తి గొడవలు, ప్రోనోట్ కేసులు, భార్యభర్తల గొడవులు వంటివి రాజీ అయినప్పుడు ఇద్దరూ గెలిచినట్టే సంతోషిస్తారు. ఆ సంతోష సమయాన మా కష్టం మర్చిపోతాం. న్యాయమూర్తులు కూడా కొన్నిసార్లు మమ్మలను అభినందిస్తున్నారు.

– జి.వ్యాసు, కానిస్టేబుల్,
బుధరాయవలస పోలీస్‌స్టేషన్,
మెరకముడిదాం మండలం

400 కేసుల రాజీ



నేను రామభద్రపురం పోలీస్‌స్టేషన్ నుంచి కోర్టు పనులు చూస్తున్నాను. రెండేళ్లలో సుమారు 400 కేసుల వరకు లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యాయి. ఇందులో మాతో పాటు పోలీస్ అధికారుల కృషి ఉంటుంది. న్యాయవాదులు తరచూ వినిపించే రాజీయే రాజమార్గం మంత్రాన్ని కక్షిదారులకు బోధిస్తాం. కొందరు తప్పుతెలుసుకుని రాజీకి మొగ్గచూపుతారు. ఆ క్షణంలో నష్టంజరిగిన వారు ఒక అడుగు వెనుకకు తగ్గినా జీవితాంతం మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చేప్రయత్నం ఫలించినప్పుడు మంచిపనిచేశామన్న భావన మాకు సంతృప్తిని కలిగిస్తుంది.

– టి.నాగార్జున, రామభద్రపురం పోలీస్ స్టేషన్

న్యూస్‌రీల్

డీపీఓగా శ్రీధర్‌రాజా

విజయనగరం గంటస్తంభం: జిల్లా పంచాయతీ అధికారిగా శ్రీధర్‌రాజా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కేంద్ర కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. గతంలో జిల్లాలోని పలు మండలాలకు ఎంపీడీఓగా, డిప్యూటీ సీఈఓగా పనిచేశారు. అనంతరం జిల్లా నుంచి బదిలీపై వెళ్లి తాజాగా డీపీఓగా వచ్చారు. ఇందిరా రమణి మృతి చెందిన తరువాత ఈ పోస్టులో డీడీఓ నిర్మలాదేవి ఇన్‌చార్జిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

నేడు వార్షిక కల్యాణం



బోడికొండపై కోదండ రామాలయం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం బోడికొండపై వెలసిన కోదండ రామాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. స్వామివారికి ప్రాతఃకాల పూజలనంతరం విశేష హోమాలు జరిపించనున్నారు. సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తం చేపట్టి స్వామివారి వార్షిక కల్యాణాన్ని జరిపిస్తామని అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్ తెలిపారు.

అన్నపూర్ణ సేవలకు సత్కారం



బ్రెట్‌లీ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకుంటున్న అన్నపూర్ణ

రామభద్రపురం: గిరిజమహిళల సాధికారతకు విశిష్ట సేవలందించిన రామభద్రపురం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంస్థ డెరెక్టర్ డాక్టర్ శతపతి అన్నపూర్ణకు ఇండియా బ్రాండ్ ఐకాన్ సంస్థ గిరిజన మహిళా సాధికారత సేవా అవార్డుతో సత్కరించింది. ముంబయిలో క్రికెటర్ బ్రెట్‌లీ చేతుల మీదుగా గురువారం ఉత్తమ సేవా అవార్డును అందుకున్నట్టు ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. ఆమెను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, గ్రామ ఉపసర్పంచ్ చింతల రామకృష్ణ, గ్రామ పెద్దలు అభినందించారు.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్య



మృతుడు బగాదివెంకటరమణ

మెరకముడిదాం: మండలంలోని గోపన్నవలస గ్రామంలో గడ్డిమందు తాగి బగాది వెంకటరమణ(58) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బగాది వెంకటరమణ గత కొంతకాలంగా పక్షవాతవ వ్యాధితో బాధపడుతున్నాడు. అతని వైద్యానికి అధిక డబ్బులు ఖర్చువుతుండడంతో మనస్థాపానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎవరూ ఇంటిలో లేని సమయంలో శుక్రవారం సాయంత్రం గడ్డమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధరాయవలస ఎస్‌ఐ నవీన్‌పడాల్ ఘటనా స్థలాన్ని పరిశీలంచారు. కుటుంబ సభ్యులనుంచి వివరాలు సేకరించి కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి సీహెచ్‌సీకి తరలించారు.

చినబంటుపల్లిలో...



ఆత్మహత్యకు పాల్పడిన రెడ్డి వెంకటరమణ

చినబంటుపల్లి గ్రామంలో రెడ్డివెంకటరమణ (55) అనే వ్యక్తి పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చినబంటుపల్లికి చెందిన రెడ్డి వెంకటరమణ కొంతకాలంగా మూలవ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధితో కలిగే నొప్పిని తట్టుకోలేక శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బుధరాయవలస ఎస్‌ఐ నవీన్‌పడాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోష్టమార్టం నిమిత్తం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- నగరంలో అంబేడ్కర్ 9 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం నమస్కరిస్తున్న మంత్రి బొత్ససత్యనారాయణ, పాల్గొన్న కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

విజయనగరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆ మహనీయుని ఆశయ సిద్ధి కోసం పునరంకితమవుతున్నామని స్పష్టంచేశారు. భారతరత్న అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాలాజీ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన 9 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏపీ శాసనసభా డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్, ఎస్పీ ఎం దీపికాపాటిల్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు కృషిచేసిన గొప్పవ్యక్తి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేరవేర్చడమే ఆయనకు మనమిచ్చే గౌరవమని పేర్కొన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనల మేరకు నగరంలోని ప్రధాన కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. నగరంలోని బాలాజీ కూడలిను రూ.13.05 లక్షలతో అభివృద్ధిచేసి పాత అంబేడ్కర్ విగ్రహం స్థానంలో కొత్తది ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు. కోలగట్ల మాట్లాడుతూ భారతీయులంతా నేడు సగర్వంగా డా.అంబేడ్కర్ జయంతిని జరుపుకుంటున్నారంటే అందుకు కారణం ఆయన తన రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులేనని పేర్కొన్నారు. బాలాజీ కూడలిని డా.అంబేడ్కర్ కూడలిగా నామకరణం చేసి అభివృద్ధి చేస్తున్నామని, దీనిలో భాగంగా 42 ఏళ్ల కిందట నుంచి ఉన్న అంబేడ్కర్ విగ్రహం స్థానంలో కొత్తగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే మహిళా పార్కును కూడా ప్రారంభిస్తామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా నగరంలోని ప్రధాన కూడళ్లు, చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్

- కలెక్టరేట్‌లో అంబేడ్కర్ 132వ జయంతి
- పాల్గొన్న పాలకులు, అధికారులు



కలెక్టరేట్ లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీస్పీకర్ కోలగట్ల, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నో జాతులు, మతాలు, కులాలతో కూడిన మన దేశం నేటికీ ఐక్యంగా ఉందంటే భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగమేనని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. రాజ్యాంగం రూపంలో దేశానికి ఆయన వేసిన పటిష్టమైన పునాది అభివృద్ధి దిశగా నడిపిస్తోందన్నారు. దేశ ప్రజల హృదయాల్లో ఆయన ఎప్పటికీ చిరస్మరణీయుడని పేర్కొన్నారు. అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్‌తో పాటు కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, ఎస్పీ దీపిక, నగర మేయర్ వి.విజయలక్ష్మి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ అంబేడ్కర్ మేధో పరిజ్ఞానం కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాదని, ఆర్థిక, రాజకీయ, సామాజిక, న్యాయశాస్త్రాలన్నింటిలో పరిజ్ఞానం గల మహనీయుడని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ దేశంలో అందరికీ సమాన హక్కులు కల్పించాలనే గొప్ప భావన ఆ రోజుల్లోనే వచ్చిందంటే ఆయన ఎంత దార్శనికుడో అర్థంచేసుకోవచ్చన్నారు. తొలుత నెల్లిమర్ల, వేపాడ, చీపురుపల్లి, బాడంగి, వియ్యంపేట, కొప్పెర్ల గురుకులాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి, డీసీఎంఎస్ చైర్ పర్సన్ అవనాపు భావన, డీసీసీబీ చైర్మన్ వి.చిన రామునాయుడు, డీఆర్వో ఎం.గణపతిరావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రత్నం, గురుకులాల జిల్లా సమన్వయ అధికారి చంద్రావతి, జైహింద్ కుమార్, ఎ.మోహనరావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్..



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్

విజయనగరం గంటస్తంభం: భారతదేశం గర్వించదగ్గ గొప్ప మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి దిక్సూచిలాంటి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ అశోక్‌కుమార్, మన్మథకుమార్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి చెరకు క్రషింగ్



ఈఐడీ కర్మాగారంలో సాగుతున్న చెరకు క్రషింగ్

- 4.62 లక్షల టన్నుల చెరకు క్రషింగ్
- మరో 10 వేల టన్నులు క్రషింగ్ జరిగే అవకాశం
- రేపటితో ముగియనున్న చెరకు క్రషింగ్
- మూడు జిల్లాలో 13,700 ఎకరాల్లో చెరకు సేకరణ
- 90 శాతం మేర బిల్లుల చెల్లింపు

రేగిడి: రేగిడి మండలం సంకిలి వద్ద గల ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో చెరకు క్రషింగ్ సీజన్ చివరిదశకు చేరుకుంది. ఆదివారంతో చెరకు సేకరణ, క్రషింగ్ ప్రక్రియలు ముగియనున్నవి. ఖరీఫ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రైతులు 19800 హెక్టార్లలో చెరకు పంటను సాగుచేశారు. ఇందులో 13,800 హెక్టార్లలో సాగుచేసిన చెరకు పంటను క్రషింగ్‌కు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు 4.52 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని కర్మాగారం లక్ష్యంగా నిర్దేశించగా, 4.62 లక్షల టన్నుల క్రషింగ్‌ను పూర్తిచేసింది. చెరకును కర్మాగారానికి సరఫరా చేసిన రైతులకు 90 శాతం మేర బిల్లుల చెల్లించింది. గతేడాది అక్టోబర్ 18న కర్మాగారంలో క్రషింగ్ ఆరంభమైంది. ఇప్పటివరకు 4.62 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయగా, చివరిరోజుకు మరో 10 వేల టన్నుల క్రషింగ్ పూర్తికానుందని కర్మాగారం అధికారులు చెబుతున్నారు. మొత్తం 5,600 మంది రైతులు ఈ ఏడాది చెరకు పంటను ఫ్యాక్టరీకి పంపించగా వీరందరికీ నెలరోజుల వ్యవధిలో బిల్లులు చెల్లించింది.

రైతులకు సహకరిస్తూ.

ఈ దఫా ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులకు యాజమాన్యం బాగా సహకరించింది. సకాలంలో రైతుకు కటింగ్ ఆర్డర్లు ఇవ్వడంతో పాటు ఫ్యాక్టరీకి చెరకును తరలించుకునేందుకు అనుకూలంగా కూలీలు, ట్రాక్టర్లు, లారీలు ఏర్పాటుచేసింది. చెరకును తీసుకుని ఫ్యాక్టరీకి వచ్చిన రైతులకు సైతం మౌలిక వసతులు ఏర్పాటుచేయడమే కాకుండా సకాలంలో అన్‌లోడింగ్ చేయించింది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రాత్రి సమయాల్లో చెరకు రవాణా ఏర్పాట్లుచేసింది. రైతుకు నెలరోజుల వ్యవధిలో బిల్లులు చెల్లించి బాసటగా నిలిచింది.

చెరకు మద్దతు ధర ఇలా..	
సంవత్సరం	మద్దతు ధర (రూపాయల్లో)
2018-2019	2,750
2019-2020	2,750
2020-2021	2,800
2021-2022	2,900
2022-2023	2,980

'మద్దతు'గా నిలుస్తూ...

గతంలో కంటే ఈ ఏడాది చెరకు రైతుకు ఈఐడీ ప్యారీ ప్రభుత్వ మద్దతు ప్రకారం ధరను కేటాయించింది. టన్ను చెరకకు రూ. 2,980ల ప్రభుత్వ మద్దతుధరతో పాటు అదనంగా మరో రూ.100లు టన్ను వద్ద చెల్లించింది. ఎకరా సాగులో రైతుకు 40 టన్నులకు పైగా ఈ ఏడాది చెరకు పంట దిగుబడి వచ్చింది. ఫ్యాక్టరీతో ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకున్న రైతులకు ముందస్తుగా విత్తనం, ఎరువులు సరఫరా చేసి సాగును ఊతమిచ్చింది.



సంకిలి ప్యారీ సుగర్స్‌కు ట్రాక్టర్‌పై చెరకును తరలిస్తున్న రైతు (ఫైల్)

ఈ ఏడాది అంతా సక్రమంగా..



ఈ ఏడాది ఫ్యాక్టరీ పెద్ద ఎత్తున సుగర్ ఉత్పత్తి చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ప్యారీసుగర్స్‌కు డిమాండ్ ఉంది. అందుకు తగ్గట్టుగా నాణ్యమైన చెరకును ఇక్కడ రైతులు సరఫరా చేశారు. మమ్మల్ని నమ్మి చెరకు సాగుచేస్తున్న రైతుకు నష్టం లేకుండా చూస్తున్నాం. చెరకు కర్మాగారానికి సరఫరా చేసిన 14 రోజుల్లోనే నేరుగా రైతు ఖాతాలోకే నగదును జమ చేశాం. ఈ ఏడాది లక్ష్యాన్ని దాటి చెరకు క్రషింగ్ చేశాం.

– ఎ.వి.నాగిశేషారెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం, సంకిలి, రేగిడి మండలం

క్లుప్తంగా

వడదెబ్బతో ఆర్‌టీసీ కలాసీ మృతి



కొత్తవలస జంక్షన్‌లో కుప్పకూలిపోయిన కలాసీ రాము

కొత్తవలస: మండల కేంద్రంలో ఆర్‌టీసీ కలాసీగా పనిచేస్తున్న పొన్నకాయల రాము(56) శుక్రవారం వడదెబ్బ ధాటికి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కలాసీ రాము స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో పనిచేస్తుండగా ఉదయం 11.30 గంటల ప్రాంతంలో కొత్తవలస జంక్షన్‌లో గల టీ దుకాణంలో టీ తాగేందుకు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వడ దెబ్బకు గురై మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. మృతుడికి భార్య ఒక కొడుకు రాము ఉన్నారు.

రెండు లారీలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులకు వైద్య సేవలు అందిస్తున్న నర్స్

గజపతినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వద్ద ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మధుపాడ గ్రామం నుంచి గజపతినగరం వస్తున్న ఒక లారీ విశాఖ పట్నం నుంచి గజపతినగరం మీదుగా వస్తున్న మరో లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఓ లారీ డ్రైవర్, క్లీనర్‌లు కురుచరణ్ సింగ్,సాలేస్‌లకు తీవ్ర గాయాలు కావడంతో గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. మరో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు పాక్షికంగా గాయాలయ్యాయి.

అమరవీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం

- జిల్లా అగ్నిమాపక అధికారి వినయ్



మౌనం పాటిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని జిల్లా అగ్నిమాపక అధికారి కె.వినయ్ అన్నారు. శుక్రవారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జిల్లాకు వచ్చిన ఏపీ ఫైర్ సర్వీసెస్ డీజీ పీవీ సునీల్‌కుమార్‌ను కలిసి వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో స్వధార్ బాలికల గుర్తింపు

విజయనగరం ఫోర్ట్: జిల్లాకేంద్రంలోని మహిళా ప్రాంగణంలో ఉన్న స్వధార్ హోమ్ నుంచి పరారైన ఇద్దరు అమ్మాయిలు విశాఖలో ప్రత్యక్షమయ్యారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కిటికీలు వంచి ఇద్దరు అమ్మాయిలు పరారైన సంగతి విదితమే. స్వధార్ సూపరింటెండెంట్ కమల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసిన విచారణ చేపట్టారు. వారిద్దరినీ విశాఖలో ఓ హోటల్ సమీపంలో గుర్తించి, జిల్లాకేంద్రానికి తీసుకువచ్చారు. దిశ పోలీస్ స్టేషన్ ఆవరణలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల సమక్షంలో తల్లిదండ్రులకు వారిని అప్పగించనున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

గిరిసీమలో జ్వరం



సీతంపేట ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు

- ఏరియా ఆస్పత్రికి పెరుగుతున్న రోగుల తాకిడి
- సకాలంలో అందుతున్న వైద్యసేవలు
- అందుబాటులో అవసరమైన మందులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



సేవలందిస్తున్న వైద్యులు

సీతంపేట: గిరిజన ప్రాంతమైన మన్యంలో వైరల్ జ్వరాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి సమస్యలతో స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జ్వరాలకు ప్రధాన కారణం తీవ్రమైన ఎండలేనని వైద్యులు చెబుతున్నారు. సీతంపేట ఆస్పత్రికి రోజువారి ఓపీ 150 నుంచి 200 వరకు వస్తోంది. సోమవారం వారపు సంత రోజున 300మందికి పైగా రోగులు వస్తున్నారని వైద్యులు తెలియజేస్తున్నారు. మందులన్నీ అందుబాటులో ఉండడంతో పాటు స్పెషలిస్టు వైద్యులు కూడా ఉండడంతో ప్రత్యేక చికిత్సలు అందజేస్తున్నారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి తక్షణ వైద్యసేవలు అందిస్తున్నారు. అలాగే మరికొందరిని ఇన్‌పేషెంట్లుగా ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. సీతంపేట పరిసర గ్రామాలతో పాటు కొత్తూరు, భామిని తదితర మండలాల నుంచి ఇక్కడికి వైద్యసేవల కోసం వస్తున్నారు. అలాగే చిన్నపిల్లలు, వృద్ధులు కూడా జ్వరాలతో ఆస్పత్రిలో చేరుతున్నారు.

ఫ్లూ బారిన పడకుండా జాగ్రత్తలు ఇలా..

ఫ్లూ వైరస్ బారిన పడుతున్న వారికి ఎక్కువగా తీవ్రమైన దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు ఉంటుండగా.. కొందరిలో అధిక జ్వరం వస్తోంది. మరికొందరిలో తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలకు ఈ వైరస్ కారణమవుతోంది. చిన్నారులు, వృద్ధుల్లో ఈ సమస్య కొంత ఎక్కువగా కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఫ్లూ ఇన్‌ఫెక్షన్ సాధారణంగా వారం నుంచి పది రోజుల పాటు ఉంటుంది. దగ్గు మూడువారాల వరకు ఉంటుంది. 15 ఏళ్లలోపు పిల్లలు, 50 ఏళ్లు పైబడిన వారు ఈ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువని వైద్యనిపుణులు చెబుతున్నారు.

- ఫ్లూ లక్షణాలు ఉన్న వారు ఇతరులతో కరచాలనం, ఆలింగనం, దగ్గరగా కూర్చోవడం కలిసి భోజనం చేయడం కూడదు. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదు.
- సొంత వైద్యం వద్దు
- బహిరంగ ప్రదేశాల్లో, సమూహాల్లో ఉన్నపుడు విధిగా మాస్కులు ధరించాలి
- తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి
- నోరు, ముక్కు పదేపదే తాకరాదు
- దగ్గుతున్నపుడు, ముక్కు కారుతున్నపుడు గుడ్డను ఉపయోగించాలి.

భయపడాల్సిన అవసరం లేదు



ఏజెన్సీలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లునొప్పులు వంటి కేసులు వస్తున్నాయి. అవసరమైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. రిఫరల్ లేకుండా ఇక్కడే వైద్యసేవలు అందిస్తున్నాం. రోగులు అప్రమత్తంగా ఉండాలి. యాంటీ బయాటిక్స్ వాడకుండా మూడు పూటలా డోలో 650 మాత్రలు వేసుకుని విశ్రాంతి తీసుకుంటే జ్వర తీవ్రత తగ్గుతుంది. చల్లని పానీయాలు, బయట ఆహారాలకు దూరంగా ఉండాలి.

– బి.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి

వంగరలో సినీనటుడు శ్రీకాంత్

- షిర్డీసాయి బాబాను దర్శించి పూజలు



షిర్డీ సాయినాథుని దర్శించుకుంటున్న సినీ హీరో శ్రీకాంత్



అభిమానులకు అభివాదం చేస్తున్న హీరో శ్రీకాంత్

వంగర: సినీ నటుడు శ్రీకాంత్‌తోపాటు పలువురు సినీ ఆర్టిస్టులు శుక్రవారం మండల కేంద్రం వంగరలో సందడి చేశారు. బొత్స వెంకటనాయుడు, లక్ష్మీ సింహాచలం దంపతులు నిర్మించిన శ్రీషిర్డీసాయిబాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీనటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ దేవుడిపై నమ్మకం మనలో ఒక సార్థకతను.. మానవత్వాన్ని పెంచుతోందన్నారు. సినిమా షూటింగ్ వాయిదా పడడంతో ఈ ప్రాంతానికి రాగలిగానని, పల్లె వాతావరణం చాలా బాగుందని, మడ్డువలస రిజర్వాయర్ చూసిన తరువాత ఆనందం కలిగించిందని అన్నారు. సినీ ఆర్టిస్టులు చిట్టిబాబు, శ్రీలక్ష్మి, రామ్ జగన్, రాగిణి, సునామీ సుధాకర్, డబ్బింగ్ అండ్ మిమిక్రీ ఆర్టిస్ట్ జితేంద్ర పూజల్లో పాల్గొని..ప్రత్యేక ప్రత్యేక కార్యక్రమాలతో సందడి చేశారు. అనంతరం సినీనటుడు శ్రీకాంత్‌తోపాటు సినీ ఆర్టిస్టులతో స్థానికులు, అభిమానులు సెల్ఫీలు తీసుకున్నారు.

25న జీఎంఆర్ నైరెడ్‌లో స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. స్త్రీ, పురుషులకు వేరు వేరుగా శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పురుషులకు కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలీ, కార్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్‌లో నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్త్రీలకు హోమ్ నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, లేడీస్ టైలరింగ్‌లలో 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో తీసుకురావాలని సూచించారు. శిక్షణ మే 1 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8247732416, 9014716255, 9491741129, 9494952586 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

సంక్షేమానికి పెద్దపీట



పల్లిగండ్రేడులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- పేదల ఆకలి మీద ప్రతిపక్షాల రాజకీయం
- మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: కుల, మత భేదాలు లేకుండా, రాజకీయాలు చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని పల్లిగండ్రేడులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో సుమారుగా రూ. 8.50 కోట్ల నగదును సంక్షేమ పథకాల రూపంలో పల్లిగండ్రేడు గ్రామ ప్రజలకు అందించామన్నారు. వైఎస్సార్ ఆసరా కింద రూ. 86 లక్షలను మహిళలకు అందించామని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని ప్రజలకు తెలియజేశారు. పేదలు ఆర్థికంగా బలపడడం టీడీపీకి ఇష్టం లేదని, పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే వాటిపై ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఎందుకు సంక్షేమ పథకాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. సచివాలయ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పల్లిగండ్రేడులో త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరగా మంజూరు చేస్తామని మంత్రి బొత్స హామీ ఇచ్చారు.

తండ్రిని మించిన తనయుడు

దివంగత సీఎం వైఎస్ .రాజశేఖర్ రెడ్డి పేదల సంక్షేమ పథకాలు అందించడంతో ముందుండేవారని, ఆయనకు మించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో తండ్రి మించిన తనయుడు అయ్యారన్నారు.

అర్జీలు పరిష్కరిస్తాం

కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామస్తులు అందించిన అర్జీలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్లు , విద్యుత్ సమస్య తీరుస్తామని చెప్పారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి సూర్యనారాయణ రాజు, ఆర్డీఓ అప్పారావు, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి, సర్పంచ్ శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, తోట తిరుపతిరావు, కెంగువ మధుసూదన రావు, జమ్ము స్వామినాయుడు, అంబళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసలు

మండలంలోని పల్లిగండ్రేడులో మూడు కుటుంబాలు టీడీపీని వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరినట్లు గ్రామానికి చెందిన మజ్జి పెద్ద అప్పలనాయుడు, మజ్జి నర్సింహులు , మజ్జి సత్యం అన్నారు.



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనివి



కరపత్రాలను విడుదల చేస్తున్న సిబ్బంది

- ఆర్డీఓ హేమలత
- పార్వతీపురంలో జాతీయ అగ్నిమాపక దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనివని ఆర్డీఓ కె. హేమలత ప్రశంసించారు. ఈ మేరకు స్థానిక అగ్నిమాపక కేంద్రంలో జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విధుల్లో ఉండగా ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆమెతో పాటు పార్వతీపురం అగ్నిమాపక అధికారి యు. సుధాకరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విపత్తులు ఎదురైనప్పుడు అగ్నిమాపక సిబ్బంది వారి ప్రాణాలు పణంగా పెట్టి, ప్రజల ప్రాణ, ఆస్తులను కాపాడుతున్నారన్నారు. వారి సేవలను ఆమె కొనియాడారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నట్లు, ఈ వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్ టి.ఉమా మహేశ్వరరావు, అధికారి రమేష్, ఫైర్ సిబ్బంది బి. ప్రసాదరావు, ఎల్.మోహన్ కుమార్, టి.త్రినాథరావు, తవిటినాయుడు, ఫైర్ సిబ్బంది కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శుభాకాంక్షలు



వార్షిక డైరీని అందుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ కలెక్టర్ నాగలక్ష్మిని శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంటి వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీ యుగంధర్, జిల్లా కోశాధికారి వై.శంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భూషణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ పాణిగ్రాహి, జిల్లా సంయుక్త కార్యదర్శి లోచర్ల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు బి.బాలభాస్కరరావు, పట్టణ ఉపాధ్యక్షులు ఎం.సత్యనారాయణ, ఆర్గనైజింట్ సెక్రటరీ కేపీనాయుడు, జిల్లా మహిళా కార్యదర్శి ఆర్.జ్యోతి కార్యవర్గ సభ్యులు పి.సతీష్ తదితరులు ఉన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం



ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఆహ్వానం పలుకుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

సాలూరు: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించనున్న బాల వికాస్ వార్షికోత్సవాలకు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరకు ఫౌండేషన్ సభ్యులు ఆహ్వానం పలికారు. మంత్రి రాజన్నను శుక్రవారం ఆయన స్వగృహంలో కలసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ సింగిడి నరసింగరావు, జిల్లా ఉపాధ్యాయ కన్వీనర్ కొల్లూరు జగన్నాథరావు, సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల రాత మార్చిన పథకాలు

- ఎమ్మెల్యే జోగారావు



నారాయణపురంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



నూకలవాడ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు

బలిజిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమలు చేస్తున్న నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు పేదల తలమార్చేలా ఉన్నాయని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. బలిజిపేట మండలం నారాయణపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులు అందుకున్న పథకాల గురించి వారికి వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో పేదల జీవితాలలో వెలుగులు నిండుతున్నాయన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. గడప గడపకు సంక్షేమ ఫలాలు అందించి మహిళల జీవనోపాధి, కుటుంబ సంక్షేమానికి దోహదపడుతున్న ఒకే ముఖ్యమంత్రి జగన్‌హన్ రెడ్డి అని అన్నారు. ఉద్ధృతమైన కరోనా సమయంలో నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించి వారి ఆకలిమంటలు తీర్చారని గుర్తు చేశారు. అలాగే ప్రతి ఇంటా ఆర్థిక సమస్యలు తొలగించేందుకు మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాలలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించి వారి సమస్యలు తీర్చాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ రాధ, మాజీ ఎంపీటీసీ శ్రీరామమూర్తి, మాజీ సర్పంచ్ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, కె.వెంకటరమణ, జగన్, పి.చాకరాపల్లి సర్పంచ్ కె.మోహనరావు, జి.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేయండి

మండలంలోని నూకలవాడ బీటీ రోడ్డు నిర్మాణం పనులు నెలరోజుల్లో పూర్తిచేయాలని ఎమ్మెల్యే జోగారావు అధికారులకు సూచించారు. జీఎస్‌పీ నిర్మాణంతో ఉండిపోయిన రోడ్డు పనిని బీటీతో త్వరగా పూర్తిచేయాలని సూచించారు. 2కిలో మీటర్ల రోడ్డుకు సుమారు రూ.2కోటు మంజూరయ్యాయని పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. గ్రామానికి మంజూరైన గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20లక్షలు, ఇతర నిధులతో జీఎస్‌పీ పూర్తయిందని బీటీ రోడ్డు పూర్తయితే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఏఈ సంతోషకుమారి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, కె.వెంకటరమణ, బి.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్

- పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు



పీటీసీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి, నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఆనందబాబు, తదితరులు



మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి రాధారత్నం

విజయనగరం క్రైమ్: రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని పీటీసీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ టి. ఆనందబాబు పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తంగా ఇనుమడించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. అప్పారావు, డీఎస్పీ వీవీ అప్పారావు, ఏఓ టి.భవాని, మెడికల్ ఆఫీసర్ ఉదయ్ కుమార్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో అంబేడ్కర్ జయంతి

విజయనగరం లీగల్: జిల్లా కోర్టులో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చొక్కపు దాము అధ్యక్షతన కార్యక్రమంలో న్యాయమూర్తులు సికిందర్ బాషా, సంఘం ప్రతినిధులు అంజనీ కుమార్, సంతోష్, పాడుగు కుమార్, చిన అప్పారావు, మౌళి, సత్య ప్రసాద్, మన్ను తదితరులు పాల్గొన్నారు.